# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈ రోజు సైప్రస్ చేరుకున్నారు.
- భారతదేశాన్ని నక్సలిజం రహితంగా నిలిపే దిశగా పని చేస్తున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- భారత్ 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 500 గిగావాట్లకు పెంచాలనే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోసీ వెల్లడించారు.
- ఆవిష్కరణలు, పరిశోధనల సౌలభ్యాన్ని పెంపొందించే దిశగా విధాన సంస్కరణలను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ప్రకటించారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈ రోజు సైప్రస్ చేరుకున్నారు. లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో సైప్రస్ అధ్యక్షులు నికోస్ క్రిస్టోడూలైడ్స్ స్వాగతం పలికారు. ఇరువురు నాయకులు లెమెసోస్‌లో రెండు దేశాల పారిశ్రామిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారు. రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నికోసియాలో అధ్యక్షులు క్రిస్టోడూలైడ్స్‌తో అధికారిక ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. వాణిజ్యం, పెట్టుబడి, విద్య, డిజిటల్ సహకారం, ప్రాంతీయ భద్రత తదితర కీలక రంగాలపై చర్చించనున్నారు. భారతదేశం - యూరోపియన్ యూనియన్ (EU) భాగస్వామ్యం, భారతదేశం-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (IMEC)తో సహా విస్తృత అంతర్జాతీయ పరిణామాలపై కూడా నాయకులు అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది.

ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంలో భాగస్వామ్య దేశాలు చూపిన దృఢ మద్దతుకు కృతజ్ఞతలు తెలిపేందుకు తన పర్యటన ఒక అవకాశమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు వెళ్లేముందు అన్నారు. కెనడాలో జరిగే G7 శిఖరాగ్ర సమావేశం ప్రపంచ సమస్యలు, ప్రాధాన్యతలపై అభిప్రాయాలు పంచుకోవడానికి వేదికని ప్రధానమంత్రి చెప్పారు. క్రొయేషియా పర్యటన పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో ద్వైపాక్షిక సహకారానికి కొత్త మార్గాలను తెరుస్తుందని, ఇరుదేశాలు సన్నిహిత సాంస్కృతిక సంబంధాలను కలిగి ఉన్నాయని ఆయన అన్నారు.

=======================

భారతదేశ పవన విద్యుత్ సామర్థ్యం గత సంవత్సరంతో పోలిస్తే 10.5 శాతం కంటే ఎక్కువ పెరిగి 51.5 గిగావాట్లకు చేరుకుందని కేంద్ర పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈరోజు గ్లోబల్ పవన విద్యుత్ దినోత్సవం సందర్భంగా బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో  కేంద్రమంత్రి మాట్లాడుతూ... సౌరశక్తి నుండి పవన విద్యుత్ వరకు, దేశం ప్రకాశవంతమైన, స్థిరమైన భవిష్యత్‌కు మార్గం సుగమం చేస్తోందని అన్నారు. గత సంవత్సరం 193.58 గిగావాట్లుగా ఉన్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం.. ఏడాదిలో 17.13 శాతం పెరిగి 226.74 గిగావాట్లకు చేరుకుందని తెలియజేశారు. సౌర విద్యుత్ సామర్థ్యం 31.49 శాతం పెరిగి సంవత్సర కాలంలో 84.28 గిగావాట్ల నుండి 110.83 గిగావాట్లకు చేరుకుందని చెప్పారు. భారత్ 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 500 గిగావాట్లకు పెంచాలనే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రహ్లాద్ జోషి వెల్లడిస్తూ...

(వాయిష్ 30 సెకన్లు)

=======================

భారతదేశాన్ని నక్సలిజం రహితంగా నిలిపే దిశగా పని చేస్తున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నూతనంగా నియమితులైన 60 వేల 244 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలను అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... గతంలో 11 రాష్ట్రాలలో విస్తరించిన నక్సలిజం నేడు కేవలం 3 జిల్లాలకే పరిమితమైందన్నారు. దేశ పోలీసు బలగాల ఆధునీకరణ కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, సాంకేతికత సహాయంతో పూర్తి పారదర్శకతతో నియామకాలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు చట్టబద్ధమైన పాలన నడుస్తోందని అమిత్ షా వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

అదేవిధంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆకాక్షించిన 'అమృత్ కాల్' లక్ష్యాలను సాధించడం పట్ల నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. 60 వేల ఉద్యోగాలకు 48 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా...యుపి పోలీస్ రిక్రూట్‌మెంట్- ప్రమోషన్ బోర్డు ద్వారా 12 వేల 048 మంది మహిళా కానిస్టేబుళ్లతో సహ మొత్తం 60 వేల 244 మంది కానిస్టేబుళ్లను నియమించారు.

విరామం

=======================

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం 32 మంది డీఎన్ఏ నమూనాలు సరిపోలాయని, 14 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని గుజరాత్‌లోని అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు. మృతుల్లో నలుగురు అహ్మదాబాద్‌కు చెందినవారు కాగా, ఇద్దరు వడోదరకు చెందినవారు. ఖేడా, ఆరావళికి, బోటాడ్, ఉదయపూర్ చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున 4 మంది మెహసానాకు చెందినవారు ఉన్నారు. గుజరాత్ పూర్వ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ వారి బంధువులతో ఈ రోజు ఉదయం సరిపోలిందని రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘ్వీ  ప్రకటించారు.

=======================

ఆవిష్కరణలు, పరిశోధనల సౌలభ్యాన్ని పెంపొందించే దిశగా విధాన సంస్కరణలను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఆవిష్కర్తలు, పరిశోధకులకు, శాస్త్రవేత్తలు, పరిశోధన సంస్థలు ఉపయుక్తంగా ఇవి  నిలవనున్నాయి. న్యూఢిల్లీలో ఈరోజు విలేకరుల సమావేశంలో జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... దేశంలో పరిశోధన, ఆవిష్కరణలకు అనుకూల పరిస్థితులను కల్పించే ప్రక్రియలో భాగంలో నూతన విధాన సంస్కరణలను చేపడుతున్నామని చెప్పారు. పరిశోధనా సంస్థలు ప్రత్యేక పరిశోధన పరికరాలను సమకూర్చుకోవడం కోసం గవర్నమెంట్ ఇ మార్కెట్ ప్లేస్ (జెమ్) నుంచి మినహాయింపు ఇస్తున్నామని తెలిపారు.

ఇప్పుడు 200 కోట్ల రూపాయల వరకు గ్లోబల్ టెండర్లను ఆమోదించే అవకాశం సంస్థలకు అందిస్తున్నట్లు కేంద్రమంమత్రి వెల్లడిస్తూ.....

(వాయిస్ 35 సెకన్లు)

========================

అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహకంలో భాగంగా ఈరోజు  కురుక్షేత్రలోని బ్రహ్మసరోవరంలో హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ యోగా మారథాన్‌ను ప్రారంభించారు. హర్యానా యువతను యోగాతో అనుసంధానిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ యోగా మారథాన్‌లో పెద్ద సంఖ్యలో పిల్లలు, సైనికులు, మహిళలు పాల్గొన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కురుక్షేత్రలో యోగా శిబిరం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

========================

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ప్రాంతంలోని గౌరికుండ్ ఖార్క్ కొండ ప్రాంతంలో ఈ రోజు హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్, ఆరుగురు యాత్రికులతో సహా  ఏడుగురు మరణించారు.  హెలికాప్టర్ ఈ ఉదయం కేదార్‌నాథ్ నుండి గుప్తకాశీకి బయలుదేరి, గౌరికుండ్ సమీపంలో కూలిపోయిందని  డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే, సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి రెండు రోజుల పాటు హెలికాప్టర్ సేవలను నిలిపివేయాలని ఆదేశించారు. ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ... ప్రయాణీకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని, తగిన దర్యాప్తు అనంతరం హెలికాప్టర్ సేవలను తిరిగి ప్రారంభిస్తామని ఆయన అన్నారు. ముందు జాగ్రత్తగా DGCA ఇప్పటికే చార్ ధామ్‌కు హెలికాప్టర్ సేవల పరిమితిని తగ్గించింది.

========================
========================